క్లుప్తంగా

నేడు మెగా పశువైద్య శిబిరం

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస గ్రామంలో మెగా పశువైద్య శిబిరం గురువారం నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ ఎల్.విష్ణు తెలిపారు. బుధవారం వైద్య శిబిరం ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పునరుత్పత్తితో పాటు పాల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా గరివిడి పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో నిష్ణాతులైన పశువైద్యులతో వైద్యసేవలు అందించనున్నారని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి, వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమై పశువులకు శస్త్ర చికిత్సలు చేస్తారని, ఉచితంగా మందులు కూడా అందిస్తారని తెలిపారు.

62 మద్యంసీసాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని చిన్నయ్యపేట జంక్షన్‌లో అక్రమంగా విక్రయిస్తున్న 62 మద్యంసీసాలను పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నందున సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

వాహన తనిఖీలు



కారులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండల కేంద్రంలోని అన్ని ప్రధాన కూడళ్లలో సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేంద్రనాయుడు సిబ్బందితో కలిసి బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. మాదక ద్రవ్యాల రవాణా అరికట్టడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ జరగకుండా తనిఖీలు ముమ్మరం చేశామని సీఐ తెలిపారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

రూ.6.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

రాజాం: స్థానిక పట్టణంలోని ఆదినారాయణ కాలనీలో దాదాపు రూ.6.5 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం బుధవారం చేపట్టారు. మున్సిపల్ ఏఈ పి.వెంకట్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కలిసి ఈ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని కాంట్రాక్టరుకు సూచించారు. 400 మీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేసినట్లు ఏఈ తెలిపారు.

డ్రోన్ సర్వే ప్రారంభం



రేగిడి: వండానపేటలో భూముల సర్వేకు సిద్ధం చేసిన డ్రోన్

రేగిడి: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని వన్నలి, వండానపేట గ్రామాల్లో డ్రోన్ సర్వే బుధవారం ప్రారంభించారు. జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పేరిట ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయని తహసీల్దరు సుదర్శనరావు తెలిపారు. రైతుల సమక్షంలో సర్వే చేయాలని, సర్వేయర్లకు కూడా సహకరించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు సన్నిందొర, భారతి, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు నిర్మాణ పనులు త్వరితగతిన చేపడుతున్నారు. బుధవారం ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. 10 రోజుల్లోగా అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్యసేవలు



బాడంగి: ఆనవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను తిలకించి, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్యసేవలు అందుతున్నాయి. ప్రజారోగ్యానికి భరోసానిస్తూ గ్రామ గ్రామాన చేపడుతున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు చేయడంతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారని, 45 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు కోరారు.
– సాక్షి నెట్‌వర్క్



రాజాం: పెనుబాకలో చిన్నారికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యుడు కోటేశ్వరరావు



వంగర: కొప్పరలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చేస్తున్న నేత్రవైద్య తనిఖీలను పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, ఎంపీటీసీ సన్యాసినాయుడు, సర్పంచ్ నారాయుడు



రామభద్రపురం: గొల్లలపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, వైద్యాధికారులు



సంతకవిటి: గోళ్లవలసలో మందుల కిట్ బ్యాగు అందజేస్తున్న సర్పంచ్ దాలినాయుడు, ఎంపీడీవో రవికుమార్



బొబ్బిలి: శివడవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: నందబలగలో వైద్యశిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను తిలకిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో రామకృష్ణ



రేగిడి: లింగాలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు



తెర్లాం: నందబలగలో అందజేస్తున్న మందులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో రామకృష్ణ



మెంటాడ: తమ్మిరాజుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



సంతకవిటి: ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి.ఎస్.పురం గ్రామంలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు అన్ని విధాలా బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. గతంలో టీడీపీ పథకాల పేరిట ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన పథకాల్లో ఇంతవరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ పప్పల ఈశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ



తెర్లాం: క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



సంతకవిటి: వంటపాత్రలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడాసామగ్రిని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఈ క్రీడా పరికరాలు అందజేసిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని, వీటిని కేటాయించడం జరిగిందన్నారు. మండలంలోని 11 హైస్కూళ్లు, 8 యూపీ స్కూళ్లు, 47 ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం ఈ క్రీడా పరికరాలు అందజేసిందని ఎంఈవో త్రినాథరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన వంటపాత్రలు, క్రీడాసామగ్రిని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దారు సులోచనారాణి, ఎంఈవోలు శాంతకుమారి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



సంతకవిటి: జి.ఎస్.పురంలో కొత్తగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురం గ్రామంలో కొత్తగా రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టి, ప్రారంభిస్తోందన్నారు. ఒకప్పుడు వైద్యసేవలకు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, దీంతో ప్రజలు వ్యయప్రయాసలకు గురయ్యేవారన్నారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని గ్రామాల్లోనే ప్రజలకు వైద్యసేవలు అందేలా వెల్‌నెస్ సెంటర్లు(విలేజ్ హెల్త్ క్లినిక్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ పి.ఈశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



రాము చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలసకు చెందిన వైఎస్సార్ సీపీ నేత, డీలర్ శాసపు రాము మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను ఆయన కుమారుడు అప్పలనాయుడును అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు రాము చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వంగర: మండలంలోని కోనంగిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ చందక తాతబాబు మాట్లాడుతూ సైబర్ మోసాల బారినపడకుండా జాగ్రత్త పడాలని, బ్యాంకు ఖాతాల నిర్వహణ, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమన్నారు. ఇవే విషయాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ బి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

- నాబార్డు జనరల్ మేనేజర్ జయకన్నన్



శిక్షణార్థులతో మాట్లాడుతున్న నాబార్డు జీఎం జయకన్నన్

రాజాం: స్థానిక పట్టణంలోని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ అండ్ ఎంపవర్ ట్రస్ట్‌ను నాబార్డు జనరల్ మేనేజర్ పి.జయకన్నన్, డీడీఎం నాగార్జున కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. జీవితంలో స్థిరపడేలా ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే మరి కొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డీడీఎం మాట్లాడుతూ అత్యుత్తమ పనిమంతులుగా శిక్షణార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రైనింగ్ శిక్షణ పొందుతున్న శిక్షణార్థులతో పాటు ఎంఈడీపీ ద్వారా శిక్షణ పొందిన మహిళలతో మాట్లాడి, శిక్షణ పొందుతున్నవారికి టూల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం డీసీసీబీ డీజీఎం వాసు, ఆర్‌డబ్ల్యూఎస్ రిటైర్డ్ ఎస్ఈ ప్రభాకరరావు, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ సీఎం జగన్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరిగేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని చింతాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్న ఘనత ఒక్క సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అయితే ప్రజలు వాటిని నమ్మడం లేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్థిక నేరస్తుడు అని, అందుకే జైలు జీవితం గడుపుతున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి అరెస్టుకు నిరసనగా టీడీపీ ధర్నాలు, నిరసనలు చేయడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శంబంగి వేణుగోపాలనాయుడు, తహసీల్దారు డోల రాజేశ్వరరావు, ఎంపీడీవో పోతుల రవికుమార్, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, సర్పంచ్ బంకురు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మిఠాయిలు పంచిపెట్టారు. మండలంలోని అలజంగి సీబీఎం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు విద్యార్థినులతో మొక్కలు నాటించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే బాలికల సంరక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు.

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ మాట్లాడుతూ బాలికలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా చూడాలన్నారు. ఇదిలా ఉండగా బాలికలకు అందుబాటులో న్యాయం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: తూటికాడ కషాయంతో వరి పంటలో వచ్చే దోమపోటు తెగులు నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ రమాదేవి అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. 30 లీటర్ల ఆవుమూత్రం, మరో 30 కిలోల తూటికాడ ఆకులను కలిపి మరగబెట్టాలని తద్వారా వచ్చిన ద్రావణాన్ని నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కషాయంతో సుడిదోమ, తెల్లదోమ నివారణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ రమణ పాల్గొన్నారు.

సక్రమంగా జగనన్న గోరుముద్ద పథకం



రాజాం పోలీస్‌స్టేషన్ ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూసి, పరిశీలిస్తున్న ఎంఈవోలు దుర్గారావు, ప్రవీణ్‌కుమార్

రాజాం: సక్రమంగా జగనన్న గోరుముద్ద పథకం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచి కలిగి ఉండాలని ఎంఈవోలు వై.దుర్గారావు, పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు పలు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన వారు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం, జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

సంక్షిప్తంగా...

15 నుంచి హిందూ ధర్మప్రచార వారోత్సవాలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు హిందూ ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ ఈవో బి.వి.మాధవరావు బుధవారం తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయన్నారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయండి

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని ఎంఈవో పాపారావు, సర్వశిక్ష ఏఈ శ్రీరామ్మూర్తి తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను బుధవారం వారు పరిశీలించారు. సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రాజాం సిటీ: మండలంలోని ఆగూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగానే మురుగు కాలువలు శుభ్రం చేయడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నామని ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పాఠశాల పరిసరాల పరిశుభ్రంతో పాటు గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు.

14న బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

తెర్లాం: మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 14న అండర్-19 జూనియర్ బాలురు, బాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయకుమార్, ఆర్.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వరకు చిత్తూరు జిల్లా నగరిలో రాష్ట్ర స్థాయి అండర్-19 జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నామని, జనవరి 2, 2004 తరువాత పుట్టిన వారు అర్హులన్నారు.

ఈకేవైసీకి ఆఖరు నేడు

రాజాం సిటీ: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులంతా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో ఎం.రేణుకాసాయి సూచించారు. బుధవారం మండలంలోని ఒమ్మి గ్రామంలో చేపడుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ వరకు ఈకేవైసీ నమోదుకు గడువు ఉందన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీ(కస్తూరిబాగాంధీ విద్యాలయం)లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను బుధవారం నిర్వహించారు. యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలలకు అందుబాటులో న్యాయం అన్న అంశంపై చేపట్టిన ఈ పోటీల్లో ముగ్గురు విజేతలుగా నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ సోషల్ వర్కర్ హరీష్ పాల్గొన్నారు.

సన్మానం

రేగిడి: మండలంలోని ఏవీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023 సంవత్సరానికి గాను చిన నాగయ్య స్మారక తెలుగు భాషా ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందిన పిల్లా తిరుపతిరావును బుధవారం ఘనంగా సత్కరించారు. ఇదే పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.రామచంద్రుడు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను కూడా సన్మానించారు.

అభివృద్ధి నివేదికలు సిద్ధంచేయాలి

రాజాం: మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధి నివేదికలు సిద్ధం చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం సీసీలు, సీఎఫ్‌లు, వీవోలకు ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ పేదరిక తగ్గింపు ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల వారీగా మౌలిక వసతులు, సేవలు, వనరులు గుర్తించి, ఓ ప్రణాళిక తయారు చేసి, గ్రామసభ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి నిధుల నిమిత్తం నివేదికలు ఇవ్వాలని కోరారు.